# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# కేఫే జీత్

ఇరవైరెండేళ్ళ ఉద్యోగ జీవితంలో అలిసిపోయిన మనసునీ, శరీరాన్నీ పునరుత్తేజితం ( రీజువెనేట్ అనే మాటకర్ధం ఇదేనా?) కావించుకోమని మా కంపెనీ వారు ఒక ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త వారం రోజులపాటు నిర్వహించే యోగా శిబిరానికి పంపారు. కంపెనీ వారిచ్చే అవకాశాన్ని కాదనడమెందుకనీ, నాకూ కాస్త ఛేంజ్ గా ఉంటుందనీ వెళ్ళాను. తిరిగి వచ్చేటపుడు బెంగుళూరు లో చిన్న పని చూసుకుని అక్కడనించి ముంబై వెళ్ళడానికని బెంగుళూరు విమానాశ్రయానికి చేరుకున్నాను.

ఏవేవో ఆసనాలూ, ధ్యానాలూ అంటూ బాగానే వాయించారు వారం రోజులూ. అప్పుడు తెలీని అలసట ఇప్పుడు తెలుస్తోంది, కళ్ళ మీదకి నిద్ర కూరుకుని వస్తోంది. కొంచం కాఫీ తాగితే నిద్రనెదుర్కోవచ్చేమోనన్న ఆలోచనతో దగ్గరున్న కాఫీ షాప్ కి నడిచాను. ఒక కాఫీ ఆర్డర్ చేసి డబ్బులివ్వడానికి చేయి చాపిన నేను కౌంటర్ లో కూర్చున్న అతన్ని చూసి ఆశ్చర్యపోయాను.

" అజిత్, నువ్వా??" అన్నాను ఆనందంగా.పెద్దగా ఏమీ మారలేదు అతను.

"అజిత్, బావున్నావా??" ఎన్నాళ్ళయింది నిన్ను చూసి?" అన్నాను సంతోషంగా

" బావున్నాను మేడం! మీరెలా ఉన్నారు? ఇప్పుడెక్కడున్నారు? బాబు ఎలా ఉన్నాడు?" అంటూ అడిగాడు. అన్నేళ్ళతర్వాత నన్ను చూసినందుకు అతనిలోనూ సంతోషం.

" అందరం బావున్నాం, నేను ఇప్పుడు ముంబయిలో ఉంటున్నాను, బాబు పెద్దవాడయిపోయాడు " అంటూ వివరాలు చెప్పాను.

" నువ్వేమిటి? ఇక్కడెలా? బావుందే కాఫీషాప్? ఇక్కడ పనిచేస్తున్నావా?" అని అడిగాను.

" లేదు మేడం. ఇది నాదే" అన్నాడు నెమ్మదిగా.

"నిజంగా! భలే, కంగ్రాచ్యులేషన్స్" అంటూ అతనితో చేయి కలిపాను. సిగ్గుపడుతూ నా చేయి తాకీ తాకనట్టు గా కలిపి వదిలేశాడు. ఇదీ మారలేదు అనుకున్నాను అతనివంక చూస్తూ..

"రండి మేడం కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ పక్కనున్న అబ్బాయిని కాష్ కౌంటర్ చూసుకోమని చెప్పి కౌంటర్ నించి ఇటువైపుకు వచ్చాడు. ఇద్దరం ఒక టేబిల్ దగ్గర కూర్చున్నాం. నా కాఫీ వచ్చింది బిల్ లేకుండా.

" ఆ కంపెనీ లో నేను మానేశాకా కొన్నాళ్ళు కొందరితో టచ్ లో ఉన్నాను, ఆ తర్వాత అది మూసేశారని తెలిసింది. ఆపైన ఎవరి వివరాలూ ఎక్కువగా తెలియలేదు. ముఖ్యంగా నీవి, కాంచనవి, వసంతవీ" అన్నాను.

అతను నవ్వాడు. వసంత మా ఎడ్మిన్ అమ్మాయి, గల గలా నవ్వుతూ మాట్లాడేది, ఒకసారి మాట్లాడితే మర్చిపోవడం కష్టం. కాంచన ఆ కంపెనీ రిసెప్షనిస్ట్. ఎంతో అందమయిన మెత్తని చిరునవ్వు, ఎప్పుడూ నవ్వుతూనే ఉండేది. ఇక అజిత్.. అతనిదే ఈ కథ..

---

అజిత్ కీ నాకూ పరిచయం దాదాపు పదేళ్ళక్రిందటిది. మా వారి ఉద్యోగ రీత్యా అమెరికాలో కొన్నేళ్ళుండి బెంగుళూరుకి తిరిగివచ్చిన తర్వాత నేనొక చిన్న సైజు సాఫ్ట్ వేర్ కంపెనీలో మానవ వనరుల విభాగంలో చేరాను. దాదాపు నూట యాభైమంది ఉంటారేమో ఆ కంపెనీలో, నేను పనిచేసే కాంపస్ లో. అది కాక మరొక చోట ఇంకో వందమంది, అమెరికాలో ఇద్దరూ, సింగపూర్ లో ఇద్దరూ పనిచేసేవారు. మూడు అంతస్థులలో ఉండేదా ఆఫీసు. అన్నింటికన్నా పైన డాబా మీద చిన్న కాంటీనూ, ఉద్యోగులు కూర్చుని భోజనం చెయ్యడానికనువుగా వేసి ఉన్న

కుర్చీలూ, టేబిళ్ళూ, ఒక పక్కన వేసి ఉన్న టేబిల్ టెన్నిస్ బోర్డ్, రెండు కేరం బోర్డులూ, రెండు చెస్ బోర్డులూ. ఇలా ఇప్పటి కార్పోరేట్ వాసనలు సోకనట్టుగా అందంగా ఉండేది ఆ ఆఫీసు.

ఆ కేంటీన్ లో కాఫీ, టీ తయారు చేసి అందరికీ సీటు దగ్గరకే తెచ్చి ఇచ్చేవాడు అజిత్. రోజుకి రెండు సార్లు. అప్పుడు కాక మరెప్పుడు కాఫీ, టీ కావాలన్నా పైకి వెళ్ళి కొనుక్కుని తాగాలి, లేదా ఫోన్ చేస్తే అజిత్ తెచ్చి ఇచ్చేవాడు. అజిత్ కి కంపెనీ వారు ఇంత అని ఇచ్చేవారు నెలజీతం లాగా, దానితో అతను రోజుకి రెండు సార్లు ఉద్యోగులందరికీ కాఫీ టీలు ఇవ్వాలి. మిగతావి అంటే ఉద్యోగులు కొనుక్కున్నవి అతనికే. అలా ఒప్పందం అయింది.

చిన్న కంపెనీ కావడం వల్ల అందరికీ అందరూ బాగా తెలిసేవారు. ఎవరి దగ్గరకైనా ఎప్పుడైనా చనువుగా వెళ్ళి కబుర్లు చెప్పేవారు. ముఖ్యంగా హెచ్ ఆర్ లో ఉన్న మా టీము కి మరీ.

అజిత్ పేరు, అజిత్ మాధవన్ ట. కేరళ వాళ్ళు, అజిత్ డిగ్రీ చదివి, ఉద్యోగం కోసం బెంగుళూరు వచ్చాడు. ఐదడుగుల ఆరంగుళాల ఎత్తూ, చామన చాయ, నల్లటి ఒత్తైన ఉంగరాల జుట్టూ, ఎప్పుడూ నవ్వే ముఖం ( అది నవ్వా, సిగ్గా? అని అనుకునేవారు ఆఫీసులో). చాలా నెమ్మదస్థుడు. గట్టిగా మాట్లాడడం కూడా ఎప్పుడూ ఎవరూ వినలేదు.

హెచ్. ఆర్ లో ఉండడంవల్లనో, లేద స్వభావసిద్ధంగానో మొదటినించీ మనుషుల్ని బాగా గమనించడం అలవాటు నాకు.ఉద్యోగ రీత్యా అందరి ప్రవర్తననీ గమనించడం తప్పనిసరి కాబట్టి అది మరింత ఎక్కువ అయిందని చెప్పాలి. కొద్దిగా బిడియస్థులుగా ఉండేవారిని మరీ పరిశీలనగా చూసేదాన్ని. అందువల్ల అజిత్ నా దృష్టిలో పడ్డాడు. అతనేమీ కంపెనీ ఉద్యోగి కాదు, అయినా అతను నన్నాకర్షించడానికి కారణాలు కొన్ని ప్రత్యేకమైనవి. అజిత్ ని రెండు రోజులు ఎవరైనా గమనిస్తే అతనిలో ప్రస్ఫుటంగా కనిపించేవి కొన్ని ప్రత్యేక లక్షణాలు. క్రమశిక్షణ, పట్టుదల, కేవలం తన పని తప్ప మరొక విషయంలో వేలు పెట్టకపోవడం.

ఏరోజైనా పొద్దున్నే ఏడుగంటలకల్లా వచ్చేసేవాడు ఆఫీస్ కి. వస్తూనే రిజిస్టర్ లో సంతకం పెట్టి మరో చూపు లేకుండా పైకి వెళ్ళిపోయేవాడు. అక్కడ మేడ తుడిచి ఉంటే సరే, లేకపోతే తనే ఒక చీపురు తీసుకుని కాంటీనంతా తుడిచేవాడు.కుర్చీలు, టేబిల్స్ అన్నీ సరిగ్గా సర్ది పెట్టి అప్పుడు గాస్ వెలిగించి తనతో తెచ్చిన పాల పేకెట్లను పెద్ద గిన్నెలో పోసి కాచేవాడు. పెద్ద ఫిల్టర్ లో డికాక్షన్ వేసి ఉంచేవాడు.

" తొమ్మిది దాటితేకానీ ఎవరూ ఆఫీస్ కి రానే రారు కదా నువ్వెందుకు ఇంత పొద్దున్నే రావడం?" అని అడిగితే నవ్వేవాడు.

"ఎవరైనా పొద్దున్నే వస్తేనో మేడం? " అనేవాడు పైగా..

పని ఉంటే చూసుకోవడం లేదంటే కౌంటర్ వెనక వేసుకున్న ప్లాస్టిక్కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకంలో తలపెట్టుకుని కూర్చోవడం చేసేవాడు. ఇవన్నీ ఒక ఎత్తైతే కంపెనీలో ఉన్న నూట యాభైమందిలోనూ కాఫీ టీ తాగేవాళ్ళందరి అభిరుచులూ గుర్తుపెట్టుకుని వాళ్ళకి ఖచ్చితంగా అదే ఇవ్వడం. అంటే కొందరు పొద్దున్న కాఫీ తాగితే మధ్యాహ్నం టీ తాగేవారు. లేదా కొందరు పొద్దున్న పాలూ, సాయంత్రం కాఫీ, మరికొందరు ఒక పూటే టీ, కొందరు రెండుపూటలా కాఫీ, లేదా రెండు పూటలా టీ.. ఇలా రక రకాల కాంబినేషన్లు.

కొందరు ఆఫీసుకప్పుల్లో తాగడానిష్టపడక తమ స్వంత కప్పులు తెచ్చి ఇచ్చేవారు అతనికి. అవన్నీ తానే రోజూ శుభ్రం చేసి ఎవరి కప్పు వారికే, వారు కోరుకున్న పానీయం పోసి తెచ్చి ఇచ్చేవాడు. మా మేనేజర్ మంగళవారం నాడు ఏమీ తాగేవాడు కాదు, అలాంటప్పుడు పొరపాటున కూడా అతనికేమీ వేడి పానీయాలు ఇచ్చేవాడు కాదు. స్పెషల్ గా నిమ్మరసం చేసి తెచ్చేవాడు. ముంబై డబ్బావాళ్ళ లెక్కైనా తప్పిందేమో ఎప్పుడైనా కానీ నేనా కంపెనీలో ఉన్న రెండేళ్ళలోనూ ఒక్క రోజు కూడా అజిత్ లెక్క తప్పలేదు.చేసే పని పట్ల ఎంతో అంకితభావం, నిబద్ధతా, శ్రద్ధా ఉంటే తప్ప అది సాధ్యం కాదని మా హెచ్. ఆర్ హెడ్ ఎప్పుడూ అంటూ ఉండేవారు.

ఇంత ఖచ్చితంగా పని చేసేవాడు తప్పకుండా లెక్కల్లో దిట్ట అయి ఉండాలన్న నా అనుమానం అబద్ధం కాలేదు. అజిత్ కేరళ లో చదివింది బి. ఎస్. సీ మాథమేటిక్స్. కానీ "నేను చదివింది మళయాలం మీడియంలో మేడం." అనేవాడు సిగ్గుపడుతూ..

"లెక్కలకి భాషాబేధం ఉండదు అజిత్! ఇంగ్లీషైనా, మళయాళమైనా లెక్క, లెక్కే" అనేదాన్ని నేను.

" అవునూ! ఎప్పుడూ ఏదో చదువుతూ ఉంటావేమిటి? అని అడిగాను ఒకసారి.

" స్పోకెన్ ఇంగ్లీష్ కోర్స్ లో చేరాను మాడం. ఎంత డిగ్రీ ఉన్నా ఇంగ్లీష్ మాట్లాడలేకపోతే ఉపయోగం లేదుగా!" అన్నాడు నెమ్మదిగా. ఎం. బీ. ఏ చెయ్యాలనంది తన కల అని ఆరోజు నాకతను చెప్పలేదు. ఆ తర్వాత తెలిసింది నాకు. తెలివైన వాడు ఇలా కాఫీలు పెట్టుకుని బ్రతికేయకుండా, కలలు కంటున్నందుకు సంతోషించాను.

ఎక్కువగా మాట్లాడని అతనితో నాలుగు వాక్యాలు మాట్లాడించడమే గొప్ప. నాకు తమిళం రావడంతో అతనితో ఆ భాషలో నే మాట్లాడేదాన్ని. అతను ఇంగ్లీష్ నేర్చుకుంటున్నాడని తెలిశాకా, అందరితోనూ అతన్ని ఇంగ్లీష్ లోనే మాట్లాడమని ప్రోత్సహించేదాన్ని. మా టీములోవారందరినీ కూడా అలాగే మాట్లాడ మనే దాన్ని. మా మేనేజర్ కూడా 'అతనికి తగ్గ ఉద్యోగం మన కంపెనీలో వస్తే అతన్నే తీసుకోవచ్చు' అనేవారు. ఎందుకో మా అందరికీ ప్రతిభా, నిబద్ధతా కల ఆ అబ్బాయి, బొత్తిగా కాఫీ కప్పుల మధ్య ఉండిపోవడం బాధగానే ఉండేది నిజం చెప్పాలంటే.

తమది పెద్ద సంసారమనీ, నాన్న చిన్నప్పుడే పోతే అమ్మ ఇంటిదగ్గరే చిన్న షాపు పెట్టుకుని, ఇడ్లీలూ, ఇడియప్పాలూ, కాఫీ, టీలు అమ్మి ఇల్లు గడిపేదనీ, ఇద్దరక్కలు అమ్మకు తోడుగా పనిచేస్తే మరో ఇద్దరు ఇళ్ళల్లో పనికి వెళ్ళేవారనీ చెప్పాడు. తానొక్కడే మగపిల్లవాడు కావడాన, అందరికంటే ఆఖరున పుట్టిన వాడవడంవల్ల తననొక్కడినే చదివించారని కళ్ళనీళ్ళతో చెప్పాడొకరోజు.

ఇంజనీరింగ్ చదవాలని తనకున్నా, అమ్మకి లేని స్థోమత కారణంగా మంచి మార్కులొచ్చినా ఫీజులు కట్టలేక గవర్నమెంట్ కాలేజీలో బి.ఎస్. సీ లో చేరతానని చెప్పినప్పుడు అమ్మ ఎంతో ఏడ్చిందనీ, అక్కలంతా తన నిర్ణయం మార్చుకోమని ఎంతో చెప్పారనీ చాలా బాధగా చెప్పాడు. అది విన్నపుడు నాకు గొంతులో ఏదో అడ్డుపడినట్టయింది. మెల్లిగా ఇద్దరు అక్కలకి పెళ్ళి చేశామనీ, తాను డిగ్రీ అవగానే ఈ పనిలో చేరడం వల్ల అది సులువయిందని చెప్పాడు.

బెంగుళూరు రాగానే ఎందరికో నీడనిస్తున్న ఈ మహానగరం తనకీ వెంటనే ఉద్యోగం ఇచ్చి ఆదుకుంటుందని, ఉద్యోగం వెతుక్కుంటూ వస్తుందని అనుకున్నాడు, కానీ అదెందుకో అతనికి సులభంగా జరగలేదు.

"నాకు ఇంగ్లీష్ రాకపోవడంవల్లే అనుకుంటాను మేడం" అనేవాడు బాధగా. ఇంటినించి తెచ్చుకున్న కాస్త డబ్బా అయిపోవస్తుంటే తన దూరపు బంధువెవరో ఈ పని సంగతి చెప్పాడనీ, వెంటనే ఒప్పుకున్నాననీ అలా ఈ కంపెనీలోకి వచ్చానని చెప్పేవాడు. నేను పొద్దున్నే వెళ్ళేదాన్ని ఆఫీసుకి. అందువల్ల అప్పుడే అజిత్ తో తరచూ మాట్లాడుతూ ఉండేదాన్ని. ఎలాంటి సహాయం కావల్సి వచ్చినా మొహమాట పడకుండా అడగమని తరచూ చెప్పేదాన్ని.

ఆ తర్వాత నా భర్త సుమీత్ కి ముంబయి లో పెద్ద ఆఫర్ రావడంతో ముందు ఆయన, వెనకే నేనూ, మా అబ్బాయి అక్కడకి మారిపోయాము. తర్వాత దాదాపు పదేళ్ళ పాటు బెంగుళూరు రానే లేదు. బిజీ లైఫ్ లో కూడా నేను అంతకు ముందు చేసిన ఉద్యోగాలూ, ఉద్యోగస్థుల గురించి ఆలోచించినప్పుడల్లా నాకు అందరికంటే ముందుగా అజితే గుర్తొచ్చేవాడు. మొబైల్ ఫోన్ లు అప్పటికింకా అందరికీ అందుబాటులోకి రాలేదు. అజిత్ కి ఇంట్లో ఫోన్ లేదు, మెయిల్ లేదు. అందువల్ల అతన్ని మళ్ళీ కలవడం ఇప్పటివరకూ కుదరనేలేదు.

" నన్ను మర్చిపోరుగా మేడం" అన్న అతనడిగినది మాత్రం ఎప్పుడూ గుర్తొచ్చేది. ఆ తర్వాత ఇన్నాళ్ళకి ఇక్కడ..

" చెప్పు అజిత్, ఎలా ఉన్నావు? ఈ కెఫే ఏమిటి? మీ వాళ్ళందరూ ఎలా ఉన్నారు?" అని అడిగాను.

" చెప్పానుగా మేడం, ఇది నాదే, మూడేళ్ళయింది ఇది మొదలు పెట్టి, బాగానే నడుస్తోంది. ఇది మూడోది అన్నాడు చిన్నగా నవ్వుతూ..

" మూడోదా, మిగతా రెండూ ఎక్కడ ఉన్నాయి?" అన్నాను సంభ్రమంగా.

" కొచ్చిన్, త్రివేండ్రం ఎయిర్ పోర్ట్ లలో మేడమ్, బావలు చూసుకుంటారు అక్కడ, నేను అప్పుడపుడు వెళ్ళి వస్తూ ఉంటాను" అన్నాను. మళ్ళీ అదే నవ్వు, సిగ్గో, నవ్వో తెలియని నవ్వు.

" వెరీనైస్ అజిత్, ఐ యాం వెరీ హాపీ ఫర్ యూ" అన్నాను, దాచుకుందామన్నా దాగని ఆనందం నా గొంతులో, నా మనసులో..

" థాంక్ యూ మేం, ఆల్ బికాజ్ ఆఫ్ వెల్ విషర్స్ లైక్ యూ" అన్నాడు అజిత్ నమ్రతగా..

" ఇంగ్లీష్ బాగా మాట్లాడుతున్నావే? వెరీ గుడ్. నేను ఊరికే విష్ చేశాను, పిసరంత సాయం కూడా చెయ్యలేదు. అయినా నన్ను నువ్వు వెల్ విషర్ అంటున్నావా?" అన్నాను రవ్వంత బాధగా.

" ఇప్పుడు ఇంగ్లీష్ బాగానే వచ్చింది మేడం, వెల్ విషర్ అంటే మంచి కోరుకునేవాళ్ళు, నా విషయంలో అది మీరు అన్నది నిజమే కదా" అన్నాడు కొంచం పెద్దగా నవ్వుతూ..

" మాటలు బాగా నేర్చుకున్నావే? అన్నాను ఆప్యాయంగా అతనివైపు చూస్తూ..

" మేనేజ్మెంట్ కోర్సుల్లో నేర్పించేవి మాటలేకదా మేడం" అన్నాడు మళ్ళీ తనే. అంటూనే తను మంచి కాలేజీనించే ఎం.బీ.ఏ పూర్తి చేశానని చెప్పాడు.

" వెరీ గుడ్, అనుకున్నది సాధించావన్నమాట, ఉద్యోగానికి వెళ్ళలేదా మరి కోర్స్ అయిపోయాకా? అన్నాను.

" చేశాను మేడం కొన్నాళ్ళు, కానీ ఎందుకో అంతగా నచ్చలేదు. " ఓల్డ్ హేబిట్స్ డై హార్డ్ అంటారు కదా, అందుకే కాఫీలు చేసుకునే పనే నాకు బావుంటుందేమో" అంటూ నవ్వాడు.

"కేఫేలకి ఓనర్ అవ్వడం కేవలం కాఫీ కలపడమా? అసలీ ఆలోచనెలా వచ్చింది" అన్నాను ఆసక్తిగా.

" మనతో పాటు నలుగురికి పని ఇవ్వచ్చు కదా అన్న ఆలోచనలోంచి వచ్చినది మేడం ఇది. మా ఎం.బీ. ఏ కాలేజీ ప్రొఫెసర్ల సహాయంతో ఎయిర్ పోర్ట్ అధికారులతో మాట్లాడి, బిజినెస్ ఎలా మొదలు పెట్టాలో అర్ధం చేసుకుని అప్పుడు కొంత లోన్ తీసుకునీ, కొంత కూడబెట్టినదీ కలిపి మొదలు పెట్టాను. పుట్టినది ఎక్కడైనా, ఈ బ్రతుకునిచ్చినది ఈ ఊరే కనక మొదట ఇక్కడే ప్రారంభించాను మేడం. అద్దె ఎక్కువైనా బిజినెస్ కూడా బాగుంటుంది. ఇది మొదలై కొంత స్థిరపడ్డాకా మరో రెండు మా ఊళ్ళల్లో మొదలుపెట్టాము. మొత్తమ్మీద బాగానే ఉంది. మరో రెండేళ్ళలో మీ ఊరు వస్తాను" అన్నాడు.

" నాకెంతో ఆశ్చర్యం వేసింది. ఎంత ఎదిగాడు నా కళ్ళముందే? మరి నేనో? వెంటనే అనిపించింది నాకు తెలియకుండానే. అనుకున్నట్టు ప్రమోషన్ వస్తే నా గొప్పే అనుకోవడమూ, లేకపోతె ఎవరిని వీలైతే వాళ్ళని తిట్టుకోవడమూ? ఇంతేగా? అనుకున్నాను. మళ్ళీ అంతలోనే ఛా ఇలా ఆలోచిస్తున్ననేమిటి? " అని నాకు నేనే నచ్చచెప్పుకున్నాను.

" ఓ, అజిత్, ఫెంటాస్టిక్. నాకెంత ఆనందంగా, గర్వంగా ఉందో తెలుసా? అన్నాను బిగ్గరగానే.

" నాకు తెలుసు మేడం, మీరు నాకెప్పుడూ గుర్తొస్తూనే ఉండేవారు. కనీసం పెళ్ళికైనా మీలాంటివారిని పిలవాలని ఎంత అనుకున్నానో? ఇప్పటివరకూ టైం రాలేదనుకోవాలి" అన్నాడు.

" అడగడం మర్చిపోయాను, పెళ్ళయిందా? పిల్లలా? అన్నాను.

అంతలోనే మళ్ళీ పాత అజిత్ లాగా సిగ్గుపడ్డాడు. “అయింది మేడం, రాణీ, ఒక బాబు ప్రభాత్.” అంటూ చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ లోని ఫోటో చూపించాడు. తెల్లగా సన్నగా ఉన్న ఓ పాతికేళ్ళ అమ్మాయి చేతిలో నెలల బాబునెత్తుకుని ఈ కెఫే ముందే నవ్వుతూ నిల్చున్న ఫోటో..

" కెఫే జీత్.. విక్టరీ ఇన్ ఎవిరీ కప్" అన్న బంగారు రంగు అక్షరాలు మెరుస్తున్నాయి అచ్చు వాళ్ళ నవ్వుల్లాగే.

Click here to share your comments on this story